## క్లుప్తంగా

### ఆరాధనోత్సవాలకు అంకురార్పణ



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

ఓర్వకల్లు: మండలంలోని ఎస్‌కొంతలపాడు గ్రామంలో యాగంటీశ్వరస్వామి ఆరాధనోత్స వాలకు సోమవారం ఆలయ అర్చకుడు ఉరుకుందయ్య ఆచార్యులు ప్రత్యేక పూజలతో అంకురార్పణ చేశారు. స్వామి, అమ్మవార్లకు అభిషేకార్చనలు చేసి, పుష్పాలతో సుందరంగా అలంకరించారు. అనంతరం ధూపదీప నైవేద్యాలు సమర్పించి మహా మంగళహారతి ఇచ్చారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం అంతర్రాష్ట్ర కబడ్డీ పోటీలు ప్రారంభమయ్యాయి. పోటీల్లో 20 జట్లు పాల్గొన్నట్లు నిర్వాహకుడు పగిడ్యాల రాజు తెలిపారు.

### ప్రతి వస్తువుకు రసీదు తప్పనిసరి



ఎరువుల దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న ఏఓ

కోడుమూరు రూరల్: ఎరువులు, పరుగుమందు దుకాణాల్లో విక్రయించే ప్రతి వస్తువుకు రసీదును తప్పనిసరిగా ఇవ్వాలని ఏఓ రవిప్రకాష్ ఆదేశించారు. కోడుమూరులోని ఎరువులు, పురుగుమందుల దుకాణాలను సోమవారం ఆయన తనిఖీ చేశారు. ఆయా దుకాణాల్లోని ఎరువులు, మందుల శాంపిల్స్‌ను సేకరించి పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపారు. దుకాణదారులు ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులు,మందులను విక్రయించాలన్నారు. వ్యవసాయ అనుమతి లేని మందులు, ఎరువులు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

### ఫిర్యాదులకు కంట్రోల్ రూం ఏర్పాటు

కర్నూలు సిటీ: ఎన్నికల కోడ్ ఉల్లంఘన, సమాచారం, ఫిర్యాదుల కోసం కోడుమూరు నియోజకవర్గానికి సంబంధించి కర్నూలు ఆర్‌డీఓ కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు కోడుమూరు నియోజకవర్గ రిటర్నింగ్ ఆఫీసర్ ఎం.శేషిరెడ్డి తెలిపారు. నాలుగు మండలాల ప్రజలు టోల్‌ఫ్రీ నంబర్ 18004257559, 08518-294467 నంబర్లకు కాల్ చేసి తెలియజేయవచ్చని పేర్కొన్నారు.

### మట్కా బీటర్లు అరెస్ట్



నిందితుల అరెస్ట్ చూపుతున్న సీఐ, ఎస్‌ఐ

కోడుమూరు రూరల్: పట్టణంలో మట్కా రాస్తున్న ఆరుగురు బీటర్లను సోమవారం అరెస్ట్ చేసినట్లు కోడుమూరు సీఐ మన్సూరుద్దీన్, ఎస్‌ఐ బాలనరసింహులు సోమవారం తెలిపారు. వర్కూరుకు చెందిన బోయ చిన్న రాముడు, కోడుమూరుకు చెందిన తెలుగు రవి కుమార్, సహదేవ్, రాఘవేంద్ర, కమ్మరి శ్రీరాములు ఆచారి, చిన్న మద్దిలేటి మట్కా రాస్తుండగా సిబ్బందితో దాడులు నిర్వహించి అదుపులోకి తీసుకున్నామని వెల్లడించారు. వారి వద్ద నుంచి రూ.24,200 నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ, ఎస్‌ఐ పేర్కొన్నారు.

# ప్రశాంతంగా పది పరీక్షలు



పాణ్యం: విద్యార్థిని తనిఖీ చేస్తున్న పోలీసు



సి.బెళగల్: పరీక్ష కేంద్రంలో హాల్‌టికెట్ నంబర్లను చూసుకుంటున్న విద్యార్థులు



గురుకుల పాఠశాల కేంద్రం వద్ద పోలీసుల తనిఖీలు



కోడుమూరు: మోడల్ స్కూల్‌లో హాల్ టికెట్ నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు



పోలీస్‌స్టేషన్ నుంచి బందోబస్తుతో ప్రశ్నపత్రాలను తీసుకెళుతున్న నిర్వాహకులు,



సి.బెళగల్: పరీక్షలు రాసేందుకు క్యూలో వెళ్తున్న బాలికలు

పాణ్యం: పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మండలంలోని నాలుగు సెంటర్లలో పరీక్షలు జరిగాయి. ఆయా కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు నిర్వహించారు. తహసీల్దార్ ఫణికుమార్ పాణ్యం ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఎంఈఓ-2 సుబ్రమణ్యం నాలుగు కేంద్రాలను పరిశీలించారు. బలపనూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల కేంద్రంలో 197 మందికి గాను 180 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. 17 మంది గైర్హాజరయ్యారు. ఎస్టీ బాలికల పాఠశాలలో 258 మంది గాను 253 మంది, పాణ్యం ఉన్నత పాఠశాలలో 280 మందికి గాను 276 మంది, విజయానికేతన్ పాఠశాలలో 268 మంది విద్యార్థులకు గాను 246 మంది పరీక్షలు రాశారు.

**కోడుమూరులో 32 మంది గైర్హాజరు**

కోడుమూరు రూరల్: మండలంలోని బాలుర, బాలికల హైస్కూల్, మోడల్ స్కూల్, లద్దగిరి హైస్కూల్, గోరంట్ల రెసిడెన్సియల్ పాఠశాలల్లో పదో తరగతి పరీక్షలు జరిగాయి. మొదటి రోజు తెలుగు పరీక్షకు మొత్తం 1,430 మంది విద్యార్థులకు గాను 1401 మంది హాజరయ్యారు. 32 మంది గైర్హాజరైనట్లు కోడుమూరు ఎంఈఓ వసంతలక్ష్మి తెలిపారు.

**సి.బెళగల్‌లో 28 మంది గైర్హాజరు**

సి బెళగల్: మండల వ్యాప్తంగా 1,307 మంది పదో తరగతి విద్యార్థుల కోసం ఐదు పరీక్ష కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. సి.బెళగల్ జెడ్పీ హైస్కూల్ పరీక్ష కేంద్రంలో 321 మంది విద్యార్థులకు గాను నలుగురు గైర్హాజరయ్యారు. అదేవిధంగా కొత్తకోట జెడ్పీహైస్కూల్ ఏ- సెంటర్‌లో 1246 మందికి గాను నలుగురు, బీ - సెంటర్‌లో 122 మందికి గాను ఏడుగురు, ఏపీ మోడల్ స్కూల్లో 310 మందికి గాను 8 మంది, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులం పరీక్ష కేంద్రంలో 308 మందికి గాను ఐదుగురు గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు. పరీక్షల సందర్భంగా ఆలయాల్లో విద్యార్థులు ప్రత్యేక పూజలు చేయడం కనిపించింది. తల్లిదండ్రుల దీవెనలు తీసుకున్నారు. ఎంఈఓ ఆదామ్‌బాషా, ఎస్‌ఐ తిమ్మారెడ్డి, ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారి గోవిందు ఆయా పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.

**ఓర్వకల్లులో 26 మంది గైర్హాజరు**

ఓర్వకల్లు: మండలంలో తొలి రోజు మొత్తం 986 మంది విద్యార్థులకు గాను 26 మంది గైర్హాజరైనట్లు ఎంఈఓ-2 ఓంకార్‌యాదవ్ తెలిపారు. ఇందులో లొద్దిపల్లె పరీక్ష కేంద్రంలో 215 మందికి గాను 8 మంది, ఓర్వకల్లు ఏపీఎంఎస్ కేంద్రంలో 207 మంది విద్యార్థులకు గాను 7 మంది, కాల్వబుగ్గ ఏపీఆర్ఎస్ కేంద్రంలో 244 మంది విద్యార్థులకు గాను 6 మంది, ఓర్వకల్లు బాలభారతి పరీక్షా కేంద్రంలో 152 మందికి గాను 1, ఓర్వకల్లు జెడ్పీహెచ్ స్కూల్ కేంద్రంలో 168 మందికి గాను నలుగురు చొప్పున గైర్హాజరైనట్లు పేర్కొన్నారు.

**గూడూరులో 683 మంది విద్యార్థులు హాజరు**

గూడూరు: పట్టణంలోని 7 ప్రభుత్వ పాఠశాలలు, మూడు ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 683 మంది విద్యార్థులు పరీక్షలు రాసినట్లు ఎంఈఓ సునీలమ్మ తెలిపారు. పట్టణంలో మూడు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

**గడివేములలో 410 మంది**

గడివేముల: మండల కేంద్రమైన గడివేముల జెడ్పీ ఉన్నత పాఠశాల, ఏపీ మోడల్ స్కూల్‌లో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఈ రెండు పరీక్ష కేంద్రాల్లో 410 మంది విద్యార్థులు హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను ఎంఈఓ-2 విమలా వసుంధర దేవి తనిఖీ చేశారు. పరీక్ష విధానం, మౌలిక వసతులు, పరిసరాలను పరిశీలించారు. ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూసుకోవాలని పరీక్షల నిర్వహణ అధికారులకు సూచించారు.

## గ్రామాల్లో ఉత్సవాల శోభ

- నేటి నుంచి బురాన్‌దొడ్డి, పలుకుదొడ్డిలో ఉరుసు
- ముడుమాలలో అమ్మవారి దేవర



పలుకుదొడ్డిలో ఉరుసుకు ముస్తాబైన బడేఖాన్ ఖాద్రీ దర్గా

సి.బెళగల్: మండల పరిధిలోని బురాన్‌దొడ్డి గ్రామంలో మంగళవారం నుంచి గోకారమయ్య ఉరుసు ప్రారంభం కానున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. మంగళవారం గంధం, బుధవారం ఉరుసు, గురువారం కిస్తీ కార్యక్రమాలు నిర్వహించనునట్లు వివరించారు. దర్గాను సోమవారం విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. అలాగే పలుకుదొడ్డి గ్రామంలోని బడేఖాన్ ఖాద్రీ (బడేసాహెబ్) ఉరుసును మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

**ముడుమాలలో దేవర**

మండల పరిధిలోని ముడుమాల గ్రామంలో మంగళవారం గ్రామ దేవత కర్రెమ్మ దేవరను నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. ఈ మేరకు ఆలయాన్ని వివిధ రకాల పుష్పాలు, విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మంగళవారం తెల్లవారుజాము నుంచి విశేష పూజలు జరుగుతాయని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

### కేసీ కాల్వకు నీటి విడుదల

గూడూరు: కర్నూలు ప్రజల తాగునీటి అవసరాల కోసం సుంకేసుల రిజర్వాయర్ నుంచి కేసీ కాల్వకు సోమవారం 81 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు డ్యాం అధికారులు తెలిపారు. డ్యాంలో కేవలం 0.069 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు.

## చెన్నసోమేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు ముస్తాబు



పోలకల్‌లోని శ్రీచెన్నసోమేశ్వర స్వామి ఆలయం

- నేడు అంకురార్పణతో ప్రారంభం
- తొలి రోజు పుష్ప రథోత్సవం
- ఎనిమిది రోజుల పాటు ఉత్సవాలు

సి.బెళగల్: సి.బెళగల్ మండలం పోలకల్ గ్రామంలోని శ్రీచెన్నసోమేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం అంకురార్పణతో బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఎనిమిది రోజుల పాటు వేడుకగా నిర్వహించేందుకు ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయాన్ని వివిధ రకాల పుష్పాలు, విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు. మార్చి 24వ తేదీ ఆదివారం రాత్రి మహా రథోత్సవాన్ని నిర్వహించనున్నారు.

**సంతాన ప్రదాత**

స్వామివారి మహా రథోత్సవం ముందు రోజు (ఈ నెల 23వ తేదీ) గొల్లలు నిష్ఠతో తుంగభద్ర జలాలను మట్టి కడవల్లో ఆలయానికి తీసుకొచ్చే సమయంలో ఎదురుగా వచ్చే గొర్రెల నుంచి రెండు పాలధారలను ఆ నీటిలోకి పితికి తీసుకొస్తారు. పాలతో కూడిన కడవలను ఆలయంలో ఉంచుతారు. తుంగభద్ర జలాలు రథోత్సవం అనంతరం పెరుగుగా మారుతుందని.. ఈ పెరుగును ప్రసాదంగా స్వీకరించిన వారికి సంతానం కలుగుతుందని భక్తుల నమ్మకం. జిల్లా నుంచే కాకుండా కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణ నుంచి భక్తులు తరలిరానున్నారు.

**రథోత్సవ కార్యక్రమాలు**

ఫాల్గుణ మాసం శుక్ల దశమి నుంచి మూడు రోజుల పాటు ఈ నెల 19, 20, 21వ తేదీల్లో రాత్రి వేళ గ్రామంలో పుష్ప రథోత్సవాలను నిర్వహిస్తారు. శుక్ల త్రయోదశి నుంచి రెండు రోజులు 22, 23వ తేదీల్లో రాత్రి ప్రభోత్సవం, తోలు బొమ్మలాట కార్యక్రమాలను నిర్వహించనున్నారు. మార్చి 24వ తేదీ మహా రథోత్సవం జరుగుతుంది. 25వ తేదీ పార్వేట, రాత్రి తోలు బొమ్మలాట కార్యక్రమాలు ఉంటాయి. 26వ తేదీ వసంతోత్సవం, అదేరోజు సాయంత్రం చక్రస్నానంతో ఉత్సవాలకు ముగింపు పలుకుతారు. ఈ మేరకు ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ధర్మకర్త పద్మనాభరెడ్డి, ప్రధాన అర్చకుడు బీచు పల్లయ్య తెలిపారు.



వెన్న అలంకరణలో స్వామివారు

**అన్నదాన కార్యక్రమం**

ఉత్సవాల్లో భాగంగా మార్చి 24, 25, 26వ తేదీల్లో అన్నదాన కార్యక్రమాలు జరగనున్నాయి. ఆలయ ధర్మకర్తలు, గ్రామ పెద్దలు, కుల సంఘాల ఆధ్వర్యంలో భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం చేయనున్నారు.

**బండలాగుడు పోటీలు**

స్వామివారి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని మార్చి 25, 26వ తేదీల్లో ఎద్దుల బండలాగుడు పోటీలు, పొట్టేళ్ల పొట్లాట పోటీలు నిర్వహించనున్నారు. గెలుపొందిన వారికి నగదు బహుమతులు అందజేస్తారు. ప్రశాంత వాతావరణంలో ఉత్సావాలు జరుపుకోవాలని, పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్‌ఐ తిమ్మారెడ్డి తెలిపారు.

## సంక్షేమ ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి

- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి



కల్లూరు అర్బన్‌లో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి



వీకర్‌సెక్షన్ కాలనీలో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే కాటసాని సతీమణి ఉమామహేశ్వరమ్మ

కల్లూరు: జగనన్న సంక్షేమ ప్రభుత్వాన్ని మరోసారి మీ విలువైన ఓటు వేసి ఆశీర్వదించాలని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఓటర్లను అభ్యర్థించారు. సోమవారం కల్లూరు అర్బన్ 37, 41వ వార్డుల్లో ఎమ్మెల్యే కాటసాని దంపతులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా పార్టీలు, వర్గాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసిన జగనన్నను మరోమారు ముఖ్యమంత్రిని చేసుకోవాలని కోరారు. టీడీపీ హయాంలో సిఫారసు ఉన్న వారికి మాత్రమే సంక్షేమ పథకాలు అందిచారని, జన్మభూమి కమిటీల పేరుతో పేదలను ఇబ్బందులకు గురి చేశారన్నారు. అధికారం కోసం మళ్లీ చంద్రబాబు పొత్తులతో వస్తున్నారని ఓటుతో ఆయనకు బుద్ధి చెప్పాలన్నారు.

**ఫ్యాన్ గుర్తుకు ఓటేయ్యండి**

నియోజకవర్గంలోని ప్రజలకు మరింత మేలు జరగాలంటే ఎన్నికల్లో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డిని గెలిపించుకోవాలని ఎమ్మెల్యే సతీమణి కాటసాని ఉమామహేశ్వరమ్మ అన్నారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని ఆమె సోమవారం వీకర్‌సెక్షన్ కాలనీలో ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. మహిళలు, అవ్వతాతలను ఆప్యాయంగా పలికరిస్తూ వైఎస్సార్ సీపీ సర్కారుకు అండగా నిలబడాలని కోరారు. కార్యక్రమంలో కల్లూరు అర్బన్ పరిధిలోని కార్పొరేటర్లు, స్థానిక నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

### పుష్ప-2 యూనిట్‌కు స్వల్ప గాయాలు



తమ్మరాజుపల్లె వద్ద బ్రిడ్జిని ఢీకొన్న వ్యాన్

పాణ్యం: మండల పరిధిలోని తమ్మరాజుపల్లె గ్రామం వద్ద జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి స్వల్ప గాయాలైనట్లు హైవే పెట్రోల్ సిబ్బంది సోమవారం తెలిపారు. యాగంటి క్షేత్రంలో రెండు రోజుల పాటు పుష్ప-2 షూటింగ్ కోసం చిత్ర యూనిట్ (సెట్టింగ్ సిబ్బంది) హైదరాబాద్ నుంచి వెళ్తుండగా కల్వర్టును ఢీకొంది. ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న హైవే పెట్రోల్ సిబ్బంది ట్రాఫిక్ అంతరాయం లేకుండా చేశారు.

## ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి



కౌలురులో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

పాణ్యం: ప్రశాంత ఎన్నికలకు అందరూ సహకరించాలని పాణ్యం సీఐ నల్లప్ప అన్నారు. సోమవారం పాణ్యం మండలం కౌలురు, మద్దూరు గ్రామాల్లో కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపధ్యంలో ప్రతి ఒక్కరూ నియమావళి పాటించాలన్నారు. పోలీసు అధికారులకు సహకరించాలని కోరారు. గ్రామాల్లో అల్లర్లు, ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సర్కిల్ పరిధిలోని సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి



మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి

కోడుమూరు రూరల్: కోడుమూరు-కర్నూలు రహదారిలోని కొత్తూరు వద్ద సోమవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో కొత్తూరు గ్రామానికి చెందిన రామయ్య (73) మృతిచెందాడు. నీళ్ల బిందెను ఎత్తుకుని రోడ్డు దాటుతుండగా, కర్నూలుకు చెందిన ఉపాధ్యాయుడు శ్రీధర్ కారులో ఉరుకుందకు వెళుతూ రంగయ్యను వేగంగా ఢీకొట్టాడు. ప్రమాదంలో రంగయ్య తలకు తీవ్ర గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కోడుమూరు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోడుమూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన ఉపాధ్యాయుడు శ్రీధర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

**కుటుంబ సభ్యులకు పరామర్శ**

విషయం తెలుసుకున్న కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి, కోడుమూరు జెడ్పీటీసీ సభ్యుడు రఘునాథ్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ క్రిష్టారెడ్డి, మాజీ ఉపసర్పంచ్ ప్రవీణ్‌కుమార్ తదితరులు కోడుమూరు ప్రభుత్వాస్పత్రికి వెళ్లి మృతుడు రామయ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు.

# అభయం!

☛ శ్రీసత్యసాయి జిల్లా హిందూపురానికి చెందిన భాగ్యలక్ష్మి గర్భం దాల్చింది. అయితే ఆమెకు గుండెలో సమస్యలు కూడా ఉండటంతో హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు కాన్పు సమయంలో కష్టమవుతుందని భావించి కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు గత నెల 27న రెఫర్ చేశారు. ఆమెకు ఈ నెల 2వ తేదీన ఇక్కడి వైద్యులు సిజేరియన్ ద్వారా సుఖ ప్రసవం చేశారు. తల్లీబిడ్డ ఇద్దరూ క్షేమంగా ఉన్నారు.

☛ కర్నూలు జిల్లా గోనెగండ్ల మండలం కులుమాల గ్రామానికి చెందిన ముంతాజ్‌కు లంగ్ ఎటాక్(ఊపిరితిత్తుల్లో ఆరోగ్య సమస్య) వచ్చింది. దీంతో పాటు బీపీ, ఆయాసం పెరగడంతో ప్రసవం కోసం ఎమ్మిగనూరు వైద్యులు కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు వారం రోజుల క్రితం పంపించారు. ఆమెకు ఐదు రోజుల క్రితం వైద్యులు సుఖ ప్రసవమయ్యేలా చేశారు. ఊపిరితిత్తుల్లో సమస్య ఉండటంతో ఐసీయూలో ఉంచి కోలుకునేలా చేశారు. ప్రస్తుతం ఆమె పూర్తిగా కోలుకుంది.

**హైరిస్క్ గర్భిణులకు పెద్దాసుపత్రి రక్ష**

- ఇతర ఆసుపత్రుల్లో సీరియస్ అయిన కేసులూ ఇక్కడికే...
- సుఖప్రసవమయ్యేలా వైద్యుల చర్యలు
- రోజూ 30 దాకా ప్రసవాలు
- అందులో అధిక శాతం హైరిస్క్ కేసులు

కర్నూలు(హాస్పిటల్): తల్లీబిడ్డ ఆరోగ్య సంరక్షణే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోంది. దీంతో క్షేత్రస్థాయిలో వైద్య సిబ్బంది గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. హైరిస్క్ ఉన్న గర్భిణులను ముందుగానే ప్రత్యేకంగా వైద్యపరీక్షలు నిర్వహించి పర్యవేక్షిస్తున్నారు. ప్రసవానికి రెండు వారాల ముందుగానే అన్ని రకాల వసతులు ఉన్న ప్రభుత్వాసుపత్రికి తరలించి సుఖప్రసవమయ్యేలా చేస్తున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 87 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 18 కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, 40 అర్బన్‌హెల్త్ సెంటర్లు, మూడు ఏరియా ఆసుపత్రులు, రెండు బోధనాసుపత్రులు ఉన్నాయి. వీటితో పాటు 200లకు పైగా ప్రైవేటు ఆసుపత్రులు ఏర్పాటయ్యాయి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో దాదాపుగా అన్నింటిలో, ప్రైవేటులో 90కి పైగా ఆసుపత్రుల్లో ప్రసవాలు చేస్తున్నారు. ఆయా ఆసుపత్రుల్లో ఎక్కడ గర్భిణికి హైరిస్క్ ఉందని తెలిసినా వెంటనే వారు కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు రెఫర్ చేస్తారు. కేవలం ఉమ్మడి జిల్లానే గాకుండా ఉమ్మడి అనంతపురం, వైఎస్ఆర్ జిల్లా, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి సైతం హైరిస్క్ గర్భిణులను కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు తీసుకొచ్చి ప్రసవాలు చేయిస్తున్నారు.

**ప్రసూతి విభాగంలో గత ఐదేళ్ల నుంచి ఓపీ,ప్రసవాల వివరాలు ఇలా..**

| సంవత్సరం | ఓపీ | ప్రసవాల సంఖ్య |
|---|---|---|
| 2019 | 56,858 | 10,542 |
| 2020 | 25,586 | 8,372 |
| 2021 | 38,339 | 9,309 |
| 2022 | 29,661 | 9,890 |
| 2023 | 30,100 | 9,175 |

**ఏటా 10వేల ప్రసవాలకు పైగానే...**

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ప్రతి రోజూ 30 నుంచి 35 ప్రసవాలు జరుగుతున్నాయి. ఈ లెక్కన ప్రతి నెలా సగటున 800, ఏటా 10వేల వర కు ప్రసవాలు జరుగుతున్నాయి. రాష్ట్రంలోని ప్రభు త్వ ఆసుపత్రుల్లో అత్యధిక శాతం ఇక్కడే ప్రసవాలు జరుగుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. పెద్దా సుపత్రిలో ప్రత్యేకంగా మాతాశిశు సంక్షేమ భవనం ఉండటమే గాక ఇటీవల ప్రత్యేకంగా ఐసీయునూ ఏర్పాటు చేశారు. మెడికల్ సమస్యలుంటే వెంటనే ఏఎంసీలో ఉంచి వైద్యం అందిస్తుంటారు.

**హైరిస్క్ ఉన్నా సేఫ్ డెలివరీ**

ప్రసూతి విభాగానికి ప్రతిరోజూ వచ్చే ప్రసవాల్లో 5 నుంచి 7 వరకు హైరిస్క్ ప్రసవాలే ఉంటాయి. ఇవి ఆయా ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల నుంచి రెఫర్ చేయబడ్డవి. ఇతర జిల్లాల్లోని బోధనాసుపత్రుల నుంచి సైతం ఇక్కడికి రెఫరల్‌గా చికిత్స కోసం వస్తున్నాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఎక్కడ నుంచి వచ్చినా, ఏ ఆసుపత్రి వైద్యులు రెఫర్ చేసినా మాకు కూడా కష్టమే అన్న మాటే ఇక్కడ వినపడదు. హైరిస్క్‌లో ఎక్కువగా బీపీ, షుగర్, ఫిట్స్, తీవ్ర రక్తహీనత, పసిరికలు, సెప్సిస్, గుండె, కిడ్నీ జబ్బులు, థైరాయిడ్ సమస్యలున్న వాటిని హైరిస్క్ కేసులంటారు. హైరిస్క్ పేరుతో వచ్చిన గర్భిణులకు దాదాపుగా సేఫ్ డెలివరీ చేసి పంపించడమే ఇక్కడి వైద్య సిబ్బంది లక్ష్యంగా పనిచేస్తున్నారు. ఈ విషయంలో వారు సఫలీకృతమవుతున్నారు కూడా.



ప్రసూతి విభాగంలో చికిత్స పొందుతున్న బాలింతలు

**పూర్తిస్థాయిలో వైద్యుల సంఖ్య**

ఆసుపత్రిలోని ప్రసూతి విభాగంలో ఏడు యూనిట్లు ఉన్నాయి. ఇందులో ప్రస్తుతం ఐదుగురు ప్రొఫెసర్లు, ఐదుగురు అసోసియేట్ ప్రొఫెసర్లు, 18 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ఆరుగురు సీనియర్ రెసిడెంట్లు పని చేస్తున్నారు. వీరితో పాటు మొత్తం 18 పీజీ సీట్లు ఉండటంతో ప్రస్తుతం 42 మంది పీజీలు చదువుతూ వైద్యం చేస్తున్నారు. ఇందులో ఇటీవల ఆరు పీజీ సీట్లు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. వైద్యుల సంఖ్య ఎక్కువగా ఉండటంతో హైరిస్క్ కేసులు వచ్చినా ఇబ్బంది లేకుండా ఉంటోంది.

**మహానందిలో భక్తుల సందడి**

మహానంది: మహానందిలో సోమవారం భక్తుల సందడి కనిపించింది. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి తరలిరావడంతో ఆలయ ప్రాంగణాలు కళకళలాడుతున్నాయి. ఆలయానికి వచ్చిన భక్తులు కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించి శ్రీ కామేశ్వరి దేవి సహిత మహానందీశ్వర స్వామి వారిని దర్శించుకుని అభిషేకం, అర్చనలు చేశారు. ఆలయంలో ఉదయం నుంచి రద్దీ నెలకొంది.